

గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి రంగారెడ్డి జిల్లాకు చెందిన వి.మల్లికార్జునప్ప రూ.1,01,000 విరాళంగా అందజేశారు.



పేదింట విద్యా కుసుమం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పేదింటి బిడ్డ ఎంబీబీఎస్ సీటు సాధించింది. వైద్యురాలిగా పేదలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని ఆదోని పట్టణానికి చెందిన షమీనా తెలిపారు. 8లో▸



'రణమండల' కిటకిట

ఆదోని అర్బన్: పట్టణ సమీపంలోని రణమండల కొండలో వెలసిన ఆంజనేయస్వామికి శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

నవోదయకు 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): 2024–25కు విద్యా సంవత్సరానికి సంబంధించి బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. 2023–24లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి రుసుం లేకుండా www.navodaya.gov.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.

1.20 లక్షల హెక్టార్లలో పంటల సాగు

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



ఉయ్యాలవాడ సమీపంలో ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న మోహన్‌రావు

ఉయ్యాలవాడ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2.38 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1.20 లక్షల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. శనివారం మండల పరిధిలో ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, పత్తి, మినుము, మిరప, తదితర పంటలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన ఈ క్రాప్ నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యామ్‌ల్లో నీళ్లు అంతంత మాత్రమే ఉండడంతో మొక్కజొన్న, కంది, పత్తి, మినుము, సజ్జలు, కొర్రలు, తదితర రకాల పంటలు మాత్రమే సాగు చేయాలన్నారు. ఖరీఫ్ పంటల ఈ క్రాప్ నమోదుకు సెప్టెంబర్ ఆఖరు వరకు సమయం ఉందన్నారు. ఆర్‌బీకేలను సంప్రదించి తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏడీఏలు రామమోహన్‌రెడ్డి, సుధాకర్, స్థానిక ఏఓ రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

22న మైనారిటీ కమిషన్ చైర్మన్ రాక

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్, వైస్ చైర్మన్ ఈ నెల 22వ తేదిన జిల్లాకు వస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ సబీహాపర్వీన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజున ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మైనారిటీలు ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పారసీకులు తమ సమస్యలను కమిషన్‌కు నేరుగా, రాత పూర్వకంగా, ఫిర్యాదుల రూపంలో అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కే ఇక్బాల్ అహమ్మద్ ఖాన్, వైస్ చైర్మన్ డా.ఏ జాహువా డానియేల్, సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, జితేందర్‌సింగ్, షేక్ సైఫుల్లా పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఏపీ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు డీఎస్ హబీబుల్లా, స్థానిక ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో పాటు ఇతర మైనారిటీ ప్రముఖులు హాజరు కానున్నారన్నారు.

డాన్ శ్రీనుపై పీడీ యాక్ట్ కేసు

- కడప సెంట్రల్ జైల్‌కు తరలింపు

బనగానపల్లెరూరల్: జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బనగానపల్లె పట్టణానికి చెందిన మత్తుకూరు శ్రీనివాసులు (డాన్ శ్రీను)పై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి కడప సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రామిరెడ్డి శనివారం తెలిపారు. డాన్ శ్రీను బనగానపల్లె, అవుకు, నందివర్గం, నంద్యాల, ఆళ్లగడ్డ, సంజామల, గోస్పాడు పోలీసు స్టేషన్లలో పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, విక్రయం కేసుల్లో ముద్దాయిగా ఉండటంతో జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల ఉత్తర్వుల మేరకు కేసు నమోదు చేసి జైల్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఉప సంగ్రామంలో..

- 16 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం
- 3 వార్డులకే పరిమితమైన టీడీపీ మద్దతుదారులు
- కోటకందుకూరు సర్పంచ్‌గా అధికారపార్టీ మద్దతురాలు భారీ విజయం
- ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఉప ఎన్నికలు

శిరివెళ్ల మండలం యర్రగుంట్ల 8వ వార్డు అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు గుత్తి బాలరంగయ్య విజయంతో ఆనందంలో నాయకులు



వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ప్రభంజనం

నంద్యాల: జిల్లాలో జరిగిన ఉప సం'గ్రామం'లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సత్తా చాటారు. అత్యధిక వార్డు స్థానాలను కైవసం చేసుకున్నారు. ఒక సర్పంచ్ స్థానంలో సైతం విజయకేతనం ఎగురవేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామ సర్పంచుతో పాటు వేర్వేరు గ్రామ పంచాయతీల్లోని 19 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. మున్సిపల్, పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ తాజాగా జరిగిన సర్పంచ్, వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో అదే ప్రభంజనం సృష్టించింది. జిల్లాలో మూడు సర్పంచ్, 55 వార్డు మెంబర్ల స్థానాలు ఖాళీ కాగా.. ఇటీవల ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే నామినేషన్ల ఉపసంహరణ సమయానికి అవుకు మండలం అన్నవరం, కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె పంచాయతీ సర్పంచ్ స్థానాలతో పాటు, వివిధ పంచాయతీల్లోని 36 వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఒక సర్పంచ్, 19 వార్డులకు శనివారం ఎన్నికలు జరుగగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు జయకేతనం ఎగురవేశారు. 16 వార్డు మెంబర్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ప్రభంజనం సృష్టించారు. టీడీపీ మద్దతు దారులు కేవలం మూడు స్థానాలకే పరిమితమయ్యారు. పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకుల్లో ఫుల్ జోష్ నెలకొంది. వచ్చే సాధారణ ఎన్నికల్లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే తమ పార్టీకి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు..

జిల్లాలో పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను ముగించారు. జిల్లాలో జరిగిన కోటకందుకూరు సర్పంచ్, 19 వార్డులలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పోలింగ్ సాగింది. 19 వార్డులలో 7,193 ఓట్లు ఉండగా 5,802 ఓట్లు పోల్ కాగా 80.66 శాతం పోలింగ్ నమోదైంది. అనంతరం 2 గంటలకు అధికారులు ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 16 వార్డులలో గెలుపొందగా టీడీపీ మద్దతుదారులు 3 స్థానాల్లో గెలుపొందారు. కోటకందుకూరు పంచాయతీలో 3,243 ఓట్లు ఉండగా 2,620 ఓట్లు పోలు కాగా 80.79 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఈ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుడు శ్రీనివాసులుపై వైఎస్సార్‌సీపీ మద్దతురాలు లక్ష్మీదేవి 403 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జిల్లాలో ఉప ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో విజేతలైన అభ్యర్థులందరికీ పోలింగ్ కేంద్రాల్లోనే స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు.



కోటకందుకూరు గ్రామంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

నంద్యాల జిల్లా వార్డు మెంబర్ల ఎన్నికల ఫలితాలు..

నియోజకవర్గం పేరు	ఎన్నికలుజరిగిన వార్డుల సంఖ్య	వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలిచినవి	టీడీపీ మద్దతుదారులు గెలిచినవి
ఆళ్లగడ్డ	6	6	0
నందికొట్కూరు	6	5	1
డోన్	4	3	1
బనగానపల్లె	2	1	1
పాణ్యం	1	1	0
మొత్తం	19	16	3

నందికొట్కూరులో జయకేతనం.

నందికొట్కూరు నియోజకవర్గంలో 6 వార్డు మెంబర్ల స్థానాల్లో ఉప ఎన్నికలు జరుగగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఐదు వార్డుల్లో గెలుపొందారు. టీడీపీ మద్దతుదారుడు ఒక స్థానంలో గెలుపొందారు. దీంతో వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఘోర ఓటమి ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమాగా చెబుతున్నారు. వార్డు మెంబర్లను గెలిపించుకోలేని టీడీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో ఓటమి చెందుతున్నారని జోష్యం చెప్పారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనానికి టీడీపీ కనుమరుగవుతుందని చెబుతున్నారు.

టీడీపీ అడ్డాలో వైఎస్సార్‌సీపీ పాగా..

పాణ్యం మండలం కొలూరు గ్రామంలో 5వ వార్డులో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతురాలు షంషద్.. టీడీపీ మద్దతుదారురాలిగా పోటీ చేసిన జ్యోతిపై విజయం సాధించారు. కొలూరు గ్రామం మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. ఏ ఎన్నికలు జరిగినా ఈ గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వస్తుంది. వార్డు మెంబర్‌కు ఉప ఎన్నిక రావడంతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి కొందరు ఈ వార్డులో టీడీపీ గెలుస్తుందని, పోటీ వద్దని చెప్పారు. అయితే ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి చూసి ప్రజలు ఓట్లు వేస్తారని వైఎస్సార్‌సీపీ మద్దతుదారుని పోటీకి దింపారు. ఈ ఎన్నికను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని వ్యూహాలు రచించారు. చివరకు ప్రజలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారునే గెలిపించడంతో టీడీపీ అడ్డాలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరింది.

కంగుతిన్న అఖిలప్రియ



కోటకందుకూరు సర్పంచ్‌గా గెలుపొందిన లక్ష్మీదేవికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారి

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కోటకందుకూరు సర్పంచ్ స్థానంతో పాటు 6 వార్డులలో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు గెలుపొందడంతో మాజీ మంత్రి అఖిలప్రియ కంగుతిన్నారు. వార్డు మెంబర్ స్థానాలకు పోటీ చేసి ఓడిపోవడమే కంటే ఆ స్థానాల్లో పోటీ చేయకపోవడమే మేలని టీడీపీ నాయకులు అఖిలప్రియకు చెప్పినా వినిపించుకోలేదట. కచ్చితంగా పోటీ చేయాల్సిందేనని పట్టుబట్టి వారి మద్దతు దారులను బరిలోకి దింపి అభాసుపాలయ్యామని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు రాబోయే ఎన్నికలకు మరింత బలంగా మారుతుందని చెప్పినా వినిపించుకోలేదని టీడీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు భారీ మెజార్టీతో గెలుపొందడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇవే ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే గెలిపిస్తాయని ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నందికొట్కూరు జగనన్న కాలనీ ఆదర్శం



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నందికొట్కూరు: పట్టణంలోని జగనన్న కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. శనివారం జగనన్న కాలనీని తనిఖీ చేసి చివరి దశలో ఉన్న ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల గృహ నిర్మాణాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తునట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకునట్లు స్పష్టం చేశారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు ఆదేశించారు. అనంతరం బిజినవేముల గ్రామంలో సచివాలయ, రైతు భరోసా కేంద్ర నిర్మాణాలను తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మల్యాల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. జీఈఆర్ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన వలంటీర్లను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ శోభరాణి, విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఈఈ ఉమామహేశ్వర, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ అరుణ, ఈఈఓ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల తదితరులు ఉన్నారు.

మరింత పెరిగిన ఉల్లి ధర

- క్వింటా ధర గరిష్టంగా రూ.3,111



కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర మరింత పెరిగింది. శనివారం 190 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. ఈ నెల 17న క్వింటాకు గరిష్టంగా రూ.2,300 ధర లభించింది. తాజాగా కనిష్ట ధర రూ.325 ఉండగా.. గరిష్ఠంగా రూ.3,111 ధర లభించడం విశేషం. మోడల్ ధర రూ.1,611 నమోదైంది. సోమవారం నుంచి మార్కెట్‌కు ఉల్లి తాకిడి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 10,048 హెక్టార్లలో ఉల్లి సాగయింది. ఉల్లి ధర పెరుగుతుండటంతో సాగు మరింత ఎక్కువయ్యే అవకాశం కనిపిస్తోంది.

కృషి విజ్ఞాన కేంద్రానికి ఐసీఆర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లె: యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)కు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వ్యవసాయశాఖ సాంకేతికత పరిశోధన సంస్థ నుంచి ఐసీఆర్ అవార్డు దక్కింది. 2022–23 సంవత్సరానికి జోనల్‌లో పరిధిలోని 72 కేవీకేల్లో 30 విభాగాల్లో 19 ప్రశంసా పత్రాలతో యాగంటి పల్లె కేవీకేకి ఉత్తమ అవార్డు వచ్చింది. కోయంబత్తూరులోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ నెల 17–19వ తేదీ వరకు వరకు జరిగిన జోన్–10 కేవీకేల వార్షిక జోనల్ సమావేశంలో కేవీకేల ప్రగతిపై చర్చ సాగింది. చివరి రోజు శనివారం యాగంటిపల్లె కేవీకే శాస్త్రవేత్తలు జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ మేరకు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, విస్తరణ సంచాలకులు చేతుల మీదుగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ప్రధాన అధికారిణి ధనలక్ష్మి ఐసీఆర్ అవార్డు అందుకున్నారు. ఇందుకు ప్రోత్సహించిన కేవీకే కార్యదర్శి పెండేకంటి బాలాజీ, శాస్త్రవేత్తల సమష్టి కృషి వల్ల ఇది సాధ్యమైందని ధనలక్ష్మి పేర్కొన్నారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ. 33.21లక్షలు



హుండీ కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

మహానంది: మహానంది క్షేత్రానికి హుండీ కానుకల ద్వారా రూ. 33.21 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవస్థానంలోని అభిషేక మండపంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, వినాయక నంది, తదితర ఆలయాల ద్వారా రూ. 32,33,140 వచ్చిందన్నారు. దీంతో పాటు అన్నదానం విభాగం ద్వారా రూ.68,144, గోసంరక్షణ ద్వారా రూ.20,216 వచ్చినట్లు చెప్పారు. మొత్తం కలిపి రూ. 33,21,500 వచ్చిందన్నారు. నగదుతో పాటు 47.300 గ్రాముల బంగారు, 680.100 గ్రాముల వెండి లభించిందన్నారు. మొత్తం 35 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

లావాదేవీల్లో పారదర్శకతకు బయోమెట్రిక్ డివైజ్‌లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): ''బ్యాంకు లావాదేవీల్లో పారదర్శకతను పెంపొందించేందుకు 23 బ్రాంచీల్లో పనిచేసే సిబ్బందితో పాటు ప్రధాన కార్యాలయంలో పనిచేసే అధికారులకు బయోమెట్రిక్ డివైజ్‌లు ఇచ్చాం. వేలిముద్ర వేస్తేనే సంబంధిత అంశాలు ఓపన్ అవుతాయని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె ఉమ్మడి జిల్లాలోని బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతూ నిరర్థక ఆస్తులను తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్థిక సంవత్సరం మొదలై దాదాపు ఆరు నెలలు అవుతున్నందున రుణాల పంపిణీని ముమ్మరం చేయాలని సూచించారు. ప్రతి పీఏసీఎస్‌కు రైతు నేస్తం, రాజన్న చేయూత తదితర వాటి కింద రూ.కోటి బడ్జెట్ ఇచ్చామన్నారు. సీఈఓ పి.రామాంజనేయులు మాట్లాడుతూ అర్హతను బట్టి పీఏసీఎస్‌ల్లో దీర్ఘకాలిక రుణాల పంపిణీకి అవకాశం ఇచ్చామన్నారు. అందరం కలసికట్టుగా పనిచేసి బ్యాంకును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుదామని కోరారు. సమావేశంలో నంద్యాల రీజినల్ మేనేజర్ శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, డీఆర్ ఓఎస్‌డీ నాగలింగేశ్వరి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 25వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌లో సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ కృష్ణకాంత్ శనివారం క్షేత్రస్థాయి పోలీసు అధికారులతో కలసి రెండో పటాలంలో ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. దేహదారుఢ్య పరీక్షల దగ్గర ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పరీక్షకు హాజరు కావాలన్నారు. ఎస్పీ వెంట అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, యుగంధర్ బాబు, కృష్ణమోహన్‌రెడ్డి, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలంలో 105 టీఎంసీల నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం శనివారం సాయంత్రానికి 859.80 అడుగులకు చేరుకుంది. జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు 16,369 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 1.796 మిలియన్ యునిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 3,302 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. శ్రీశైలం డ్యాం పరిసర ప్రాంతాల్లో ఒక మిల్లీమీటర్ వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 105.3990 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తుంగభద్ర జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో


తుంగభద్ర రిజర్వాయర్

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ఈ నెల 1న జలాశయానికి ఇన్‌ఫ్లో 40 వేల క్యూసెక్కుల ఉండగా..శనివారానికి అది 550 క్యూసెక్కులకు పడిపోయింది. ఔట్‌ఫ్లో 9,947 క్యూసెక్కులుంది. తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యం 1,633 అడుగులతో 105.788 టీఎంసీలు. శనివారం సాయంత్రం సమయానికి 1,627.78 అడుగుల వద్ద 85.957 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎల్లెల్సీలో 250 కి.మీ వద్ద 368 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పేదింట విరిసిన విద్యా కుసుమం

- ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆదోని విద్యార్థిని
- ఈనెల 18న కడప రిమ్స్‌లో అడ్మిషన్ పొందిన షమీనా
- ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం


తల్లిదండ్రులతో షమీనా

ఆదోని అర్బన్: పేదింటి బిడ్డ తన కలను నెరవేర్చుకుంది. పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించింది. కడపలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈనెల 18వ తేదీన ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందింది. ఆదోని పట్టణానికి చెందిన విద్యార్థిని షమీనా విజయగాథ ఇదీ.. ఆదోనిలోని శంకర్‌నగర్ బీసీ కాలనీకి చెందిన ఉసేని ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య హాజరబీ కూలీ పనులకు వెళ్తోంది. వీరికి నలుగురు సంతానం కాగా..అందరినీ చదివిస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె షమీనా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదోతరగతి పూర్తి చేసుకుని విజయవాడ గురుకుల కళాశాలలో సీటు సంపాదించింది. అక్కడి అధ్యాపకుల ప్రోత్సాహంతో నీట్ కోచింగ్ తీసుకొని 543 మార్కులు సాధించింది. ఈనెల 14న కడపలోని రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు అలాట్ కావడంతో శుక్రవారం ప్రవేశం పొందింది. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా, తల్లి కూలీ పనులకు వెళ్లడంతో తానే ఇంట్లో చెల్లెళ్లు, తమ్ముడికి సాయంగా నిలిచింది. వారికి వంట చేయడం, ఇంటి పనులు చేస్తూ చదువుకునేది. రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలోనూ కష్టపడి చదివి తన కలను సాకారం చేసుకున్న షమీనాకు పలువురు అభినందనలు తెలియజేశారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నాకు ఏమి కావాలన్నా వెనుడుగు వేయకుండా అందిస్తున్నారు. మా మేనమామల ప్రోత్సాహంతో నేను బాగా చదివాను. ఎంబీబీఎస్ పూర్తి చేసి పేదలకు సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అమ్మఒడి వస్తోంది. నా చదువుకు కొంతమేర అమ్మ ఒడి ఊరటనిచ్చింది. కస్తూర్బా పాఠశాలలో, గురుకుల కళాశాలలో అధ్యాపకులు బాగా పాఠాలు చెప్పారు. – షమీనా

ఇద్దరు బీఎల్‌ఓల సస్పెన్షన్

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలంలో పని చేస్తున్న ఇద్దరు బీఎల్‌ఓలపై వేటు పడింది. కల్లూరులోని 178వ పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓగా పనిచేస్తున్న మహ్మద్ రఫీక్ బాషా, 88వ పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓగా పనిచేస్తున్న టి. శివప్రసాద్‌లను సస్పెండ్ చేశారు. వీరు ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ చేసినట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు.

63 మంది బీఎల్‌ఓలకు మెమోలు

కర్నూలు(టౌన్): ఇంటింటి ఓటర్ల సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవల్ ఆఫీసర్లకు నగరపాలక కమిషనర్ భార్గవతేజ శనివారం మెమోలు జారీ చేశారు. ఈ నెల 14, 16, 17 తేదీలలో ఆయా సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 63 మంది బీఎల్‌ఓలు (సచివాలయ కార్యదర్శులు) విధులకు గైర్హాజరయ్యారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల వ్యవధిలో సరైన సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో కళాకారుడి మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

జూపాడుబంగ్లా: తూడిచెర్ల గ్రామానికి చెందిన కళాకారుడు ఎర్రబిడి ఎరుకలి నాగేశ్వరరావు(58) పాము కాటుతో మృతి చెందారు. నాగేశ్వరరావు దాదాపు 40 ఏళ్లుగా నాటకాల్లో రాణిస్తున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పలు జిల్లాల్లో ఇప్పటి దాకా సుమారు వెయ్యి నాటకాల్లో నటించారు. వయోభారంతో ఇంటివద్దనే ఉంటూ పొలం పనులు చేసుకుంటున్నారు. శనివారం పొలంలో గట్టు వెంబడి గడ్డి కోస్తుండగా చేతికి పాము కాటు వేసింది. వెంటనే బైక్‌పై ఇంటికి చేరుకుని నాటు వైద్యం చేయించుకున్నారు. కొద్ది సేపటి తర్వాత పరిస్థితి విషమంగా ఉండటంతో ఆత్మకూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతి చెందిన కళాకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన చంద్రశేఖర్

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరులో శనివారం విద్యుదాఘాతంతో తలారి చంద్రశేఖర్(22) మృతి చెందాడు. పొలంలో సాగుచేసిన వరికి నీరు పారించేందుకు బోరు మోటరు వద్దకు వెళ్లాడు. అప్పటికే విద్యుత్‌తీగ దెబ్బతిని స్టాటర్ బాక్స్‌తో సహా విద్యుత్ సరఫరా అయ్యింది. విషయం తెలియని యువకుడు స్టాటర్ బాక్సును తాకగానే విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం


శ్రావణి రేవంత్ దీక్షిత

గూడూరు రూరల్: ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైందని ఎస్‌ఐ సోమ్లానాయక్ శనివారం విలేకరులకు తెలిపారు. కర్నూలు నగరం ఇందిరా గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న జగదీష్‌తో ఎనిమిది సంవత్సరాల కిందట శ్రావణికి వివాహమైంది. వీరికి కుమారుడు రేవంత్(6), కుమార్తె దీక్షిత(4) ఉన్నారు. జూలై 1వ తేదీ శ్రావణి తల్లి మృతి చెందింది. దీంతో పెద్దపాడులో నివాసం ఉంటున్న తండ్రి శ్రీనివాసులు వద్ద శ్రావణి పిల్లలతో పాటు వెళ్లింది. శ్రావణి భర్త కూడా పెద్దపాడుకు రాకపోకలు సాగించే వాడు. అయితే ఆయన మద్యం సేవించి ఇంటికి వచ్చి వేధింపులకు గురి చేస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రావణి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ తెలియకపోవడంతో శనివారం శ్రావణి తండ్రి శ్రీనివాసులు కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవార్డు ప్రదానం



ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఫొటో కాంపిటీషన్ జనరల్ ఫొటోగ్రఫీ విభాగంలో మూడో కన్సొలేషన్ బహుమతిని శనివారం విజయవాడ కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందుకుంటున్న 'సాక్షి' ఫొటోగ్రాఫర్ వడ్డే శ్రీనివాసులు. – కర్నూలు(సెంట్రల్)

కర్నూలులో 'లలిత జ్యువెలర్స్' ప్రారంభం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షోరూం ఎండీ కిరణ్‌కుమార్, చిత్రంలో ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు కల్చరల్: లలిత జ్యువెలర్స్ షోరూం 51వ బ్రాంచ్ కర్నూలు నగరంలో శనివారం ప్రారంభమైంది. మేడం కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన నూతన షోరూంను ఆసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. కిరణ్ కుమార్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశంలో ఎంతో గుర్తింపు ఉన్న వ్యక్తి కిరణ్ అన్నారు. నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలను కస్టమర్లకు ఇవ్వడంలో ముందుంటారన్నారు. ఎక్కడ షోరూం ఏర్పాటు చేస్తే అక్కడి వాళ్లకు ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. కర్నూలులో షోరూం ఏర్పాటు చేయడం సంతోష దాయకమన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. కస్టమర్ల నమ్మకాన్ని చూరగొన్న ప్రతి చోట లలిత జ్యువెలర్స్ షోరూంలను ప్రారంభిస్తున్నామన్నారు. మిగతా షోరూంలో నాణ్యతను, ధరలను పోల్చుకొని నచ్చితేనే నగలు కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, 13వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మి, కాటసాని ఉమామహేశ్వరమ్మ, విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులలో 0.954 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో శనివారం సాయంత్రం సమయానికి 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంకు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచి పోయింది.

చౌడేశ్వరిదేవికి లక్ష్మీ కాసుల గొలుసు బహూకరణ


బంగారు లక్ష్మీ కాసుల గొలుసు బహూకరణ రసీదును తీసుకుంటున్న భక్తులు

బనగానపల్లెరూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన చౌడం చిన్న రామయ్య, వెంకట లక్ష్మమ్మ దంపతులు లక్ష్మీకాసుల బంగారు దండను విరాళంగా శనివారం అందజేశారు. రూ.2,08,000 విలువైన 33 గ్రాముల బరువున్న దండను దాత అందజేశారని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ తెలిపారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి ప్రసాదం ఈఓ అందజేశారు.

రైతు ఉత్పత్తుల సంఘాలతో లాభదాయకం

ఉయ్యాలవాడ: గ్రామాల్లో రైతు ఉత్పత్తుల సంఘాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు, ఎఫ్‌పీఓ సంస్థ ప్రతినిధి గంగాధర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎఫ్‌పీఓ సంస్థ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ, సంజామల, ఉయ్యాలవాడ, మండలాల పరిధిలోని ఆర్‌బీకేల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 150 సంఘాలు ఏర్పడ్డాయన్నారు. వీటి సంఖ్యను పెంచేందుకు మరింత కృషి చేయాలని కోరారు. ప్రతి సంఘంలో 25 మంది సభ్యులు ఉండి గ్రామంలో రైతుల సంఖ్యను బట్టి ఎన్ని గ్రూపులైనా ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏడీఏలు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్, మండల వ్యవసాయాధికారులు రాజేంద్రకుమార్, చిన్నికృష్ణ, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 22వ తేదీన టీటీడీసీ-డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రం(బి.తాండ్రపాడు)లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీకాంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివి 21 సంవత్సరాల నుంచి 32 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు మేళాకు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు www.apssdc.in అనే వెబ్‌లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 6300009183, 8309283980 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు

కర్నూలు: నగరంలోని ఐటీసీ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న రాఘవేంద్ర నగర్‌లో నివాసముంటున్న జ్యోతిబాయి (19) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌కు చెందిన బాలు నాయక్, దేవిబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఆరు సంవత్సరాల క్రితం బాలు నాయక్ చనిపోగా కుటుంబ పరిస్థితులు బాగోలేక బతుకుదెరువు కోసం దేవీ బాయి నాలుగేళ్ల క్రితం కువైట్ వెళ్లింది. వారి రెండో కుమార్తె జ్యోతిబాయి సుగాలిమిట్టకు చెందిన రామునాయక్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వివాహమై రెండేళ్ల గడిచినప్పటికీ వీరికి సంతానం కలగలేదని దిగులుతో తరచూ గొడవ పడేవారు. రాము నాయక్ ఇంట్లో సరిగా ఉండటం లేదని, బయటకు వెళ్లి ఎప్పుడు వస్తాడో తెలియడం లేదని, సంసారం గురించి పట్టించుకోవడం లేదంటూ సోదరి పార్వతి బాయికి రెండు రోజుల క్రితం చెప్పుకుని బాధ పడింది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో జ్యోతి బాయి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. భర్త ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో ఇరుగుపొరుగు సాయంతో ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో నాల్గో పట్టణ ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీశారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తన చెల్లెలు జ్యోతి బాయి మృతిపై అనుమానం ఉందని, విచారణ జరిపి తగు న్యాయం చేయాలని సోదరి పార్వతి బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గో పట్టణ ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు.